క్లుప్తంగా

వైఎస్సార్ సీపీతోనే అభివృద్ధి సాధ్యం



రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ సుధ

కొత్తపల్లి: గ్రామాల అభివృద్ధి వైఎస్సార్ సీపీతోనే సాధ్యమవుతుందని, ఈ అభివృద్ధిని చూసి ఓర్వలేక ఎల్లోమీడియా, పచ్చ చొక్కా నాయకులు దుష్ప్రచారం చేస్తున్నారని ఎంపీపీ కారే సుధ అన్నారు. నాగులాపల్లిలో సుమారు రూ.7 లక్షలతో మండల పరిషత్ నిధులతో చేపట్టబోయే పలు అభివృద్ధి కార్యక్రమాలకు మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాగులాపల్లి అభివృద్ధికి ఎమ్మెల్యే పెండెం దొరబాబు సహకారంతో ఎంతో కృషి చేశామన్నారు. గ్రామంలో ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న లే అవుట్‌పై కొంత మంది ప్రతిపక్ష నాయకులు దుష్ప్రచారం చేస్తున్నారని, త్వరలోనే అర్హులైన ప్రతి ఒక్కరికీ పట్టాలు ఇవ్వడమే కాకుండా, గృహాలు నిర్మాణానికి బ్యాంకు రుణాలు మంజూరు చేస్తామన్నారు. 2024లో జరగనున్న ఎన్నికల్లో ఎస్సార్ సీపీ విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వడిశెట్టి గౌరీరాజేశ్వరి, కోఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాసరావు, మండల పార్టీ అధ్యక్షుడు ఆనాల సుదర్శన్, ఎంపీటీసీలు చింతపల్లి లక్ష్మీ, అనిశెట్టి సుభాషిణీ తదితరులు ఉన్నారు.

హైస్కూల్‌లో జగనన్న విద్యాకానుక పంపిణీ



జగనన్న విద్యాకానుక కిట్లు అందజేసిన కౌన్సిలర్ లక్ష్మీనారాయణ

సామర్లకోట: స్థానిక యార్లగడ్డ అక్కిరాజు మున్సిపల్ హైస్కూల్‌లోని విద్యార్థులకు మంగళవారం జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీ చేశారు. ఆ వార్డు కౌన్సిలర్, రాష్ట్ర వైఎస్సార్ సీపీ కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ విద్యార్థులకు కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమానికి పాఠశాల హెచ్ఎం యు.సత్యనారాయణ అధ్యక్షత వహించారు.

తాగునీటి చెరువులో చేపలు పడితే చర్యలు

మున్సిపల్ కమిషనర్ హెచ్చరిక



సామర్లకోట ప్రజలకు తాగునీరు అందించే నాగార్జున చెరువు

సామర్లకోట: స్థానిక ఉండూరు రైల్వే గేటు వద్ద ఉన్న తాగునీటి చెరువులో చేపల వేట సాగిస్తే చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ జె.రామారావు హెచ్చరించారు. మూడు రోజులుగా తాగునీటి చెరువు (నాగార్జున చెరువు)లో మత్స్యకార సంఘ నాయకులు చేపల వేట సాగిస్తున్నారు. చేపల వేట వల్ల ప్రజలకు ఆకుపచ్చరంగులో తాగునీరు వస్తోందని అనేకమంది మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లారు. శనివారం చెరువును పరిశీలిన మున్సిపల్ కమిషనర్ చేపల వేట సాగించడానికి వీలులేదని ఆదేశాలు ఇచ్చారు. అయినా చేపల వేట సాగించడంతో మంగళవారం హెచ్చరిక జారీ చేశారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని చేపల వేటను పూర్తి నిషేధిస్తున్నామని విలేకర్లకు తెలిపారు. హెచ్చరికను ధిక్కరించి వేట సాగిస్తే చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు.

కొనసాగుతున్న జెడ్పీటీసీ సభ్యుల శిక్షణ



సామర్లకోట ఈటీసీలో శిక్షణ పొందుతున్న జెడ్పీటీసీ సభ్యులు

సామర్లకోట: స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో శ్రీకాకుళం నుంచి ఏలూరు వరకు ఉన్న 11 జిల్లాల్లోని జెడ్పీటీసీ సభ్యులకు నిర్వహిస్తున్న శిక్షణ కొనసాగుతోంది. 11 జిల్లాల్లోని 222 మందికి శిక్షణ ఇవ్వవలసి ఉండగా బ్యాచ్‌కు 40 మందికి శిక్షణ ఇస్తున్నారు. దీనిలో భాగంగా నాల్గవ బ్యాచ్ శిక్షణ రెండవ రోజు మంగళవారం కొనసాగింది. బుధవారంతో వీరికి శిక్షణ ముగుస్తుంది. పశుసంవర్థక శాఖ ఏడీ ఎస్.శ్రీనివాసరావు, హౌసింగ్ డీఈఈ ఆర్ఎస్‌కే రాజు, ఈటీసీ ఫ్యాకల్టీలు కేఆర్ నిహారిక, ఎంఎస్ఎన్ రెడ్డి, వి.ప్రసాద్, ఆంజనేయులు శిక్షణ నిర్వహించారు.

ప్రకృతి సేద్యంతో ఆరోగ్యం దిగుబడి

- సేంద్రియంపై దృష్టి సారిస్తున్న రైతులు
- మంచి దిగుబడులు సాధిస్తున్న వైనం
- తక్కువ పెట్టుబడితో వ్యవసాయం
- 598 ఎకరాలకు విస్తరించిన సేంద్రియ సాగు



మండలంలోని గోరింట గ్రామంలో సేంద్రియ పద్ధతిలో సాగవుతున్న వరి పంట (ఫైల్)



జీవామృతం సేంద్రియ ఎరువును తయారు చేస్తున్న రైతులు

పెద్దాపురం: మనం తీసుకున్న ఆహారమే మన ఆరోగ్యాన్ని... ఆయుష్షను నిర్ణయిస్తుంది. తినే ఆహార పదార్థాలు రసాయనాలు, పురుగు మందులతో నిండిపోతే అది మన శరీరంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. విచ్చలవిడి రసాయనాల వినియోగంతో కలిగే దుష్పరిణామాలు అంతా ఇంతా కాదు. పైగా పురుగు మందుల భారమే అన్నదాతను నిలువునా ముంచుతోంది. అందుకే ప్రకృతి సేద్యంపై దృష్టి పెట్టి తక్కువ పెట్టుబడితో పెద్దాపురం మండల రైతులు ఆరోగ్యకరమైన పంట దిగుబడులు సాధిస్తున్నారు.

బ్రహ్మాస్త్రం తయారీ విధానం, లాభాలు

వేప, సీతాఫలం, గానుగ, ఉమ్మెత్త, ఆముదం ఆకులను 20 లీటర్ల ఆవు మూత్రంలో ఉడికించి చేసే కషాయాన్ని 'బ్రహ్మాస్త్రం' అని పిలుస్తారు. ఈ కషాయాన్ని పైరుపై పిచికారీ చేయాలి. తద్వారా పంటను ఆశించే పెద్ద పురుగులు నశించిపోతాయి.

నీమాత్రం..

200 లీటర్ల నీటిలో 10 లీటర్ల ఆవు మూత్రం, రెండు కిలోల ఆవుపేడ, 10 కిలోల వేపాకులు కలిపి రెండు రోజులు (48 గంటలు) నానబెట్టాలి. ఇలా వచ్చిన (నీమాత్రం) మిశ్రమాన్ని మూడో రోజు వడబోసి పంటలపై పిచికారీ చేయాలి. ఫలితంగా పంటలను ఆశించిన తెగుళ్ల (రసం పీల్చే పురుగుల)ను సమూలంగా నిర్మూలించవచ్చు. ఈ మూడింటి (ఆవు మూత్రం, ఆవుపేడ, వేపాకులు)ని పది రోజులకొకసారి ఇలా పిచికారీ చేస్తే పైరు ఏపుగా పెరగడంతో పాటు మంచి దిగుబడులు సాధించవచ్చు.

జీవామృతం తయారీ ఇలా..

200 లీటర్ల నీటిలో 10 లీటర్ల ఆవు మూత్రం, 10 కిలోల ఆవుపేడ, రెండు కిలోల బెల్లం, రెండు కిలోల పప్పు దినుసుల పిండి, పిడికెడు పుట్టమట్టి కలిపి రెండు రోజుల (48 గంటలు) పాటు నానబెట్టి, దాన్ని వడపోయాలి. ఇలా వచ్చిన జీవామతాన్ని నీటి ద్వారా పైరుకు పారనివ్వాలి. తద్వారా భూసారం పెరుగుతుంది. ప్రకృతి సేద్యం ద్వారా కేవలం రూ.500 నుంచి రూ.700 లోపు పెట్టుబడితో ఎకరా వరి పొలంలో 25 నుంచి 30 బస్తాల దిగుబడులు సాధించవచ్చని రైతులు చెబుతున్నారు.

అజోలా మదర్ పిట్

నీరు నిల్వ ఉండేలా చతురస్రాకారంలో గుంత తవ్వి పేడ, బెల్లం నీటితో కలిపి వారం రోజుల పాటు నిల్వ ఉంచాలి. దీంతో 'అజొల్లా' ఎరువు తయారవుతుంది. దీన్ని యూరియాకు ప్రత్యామ్నాయంగా వాడుకోవచ్చు. ఇది ప్రధానంగా కలుపు నివారణకు ఉపయోగపడుతుంది. ఎకరాకు 8 కేజీల అజొల్లాను వేయవలసి ఉంటుంది. చేపల పెంపకం, పాల శాతం పెంచేందుకు రోజుకు పది గ్రామాల వంతున పశువులకు మేతగా వేయవచ్చు.

ఖర్చు తక్కువ – లాభాలు ఎక్కువ

ప్రకృతి సేద్యంపై మొగ్గు చూపుతున్న రైతులు వ్యవసాయ రంగంలో పెను మార్పులు తీసుకొస్తున్నారు. సులభ పద్ధతిలో ఎరువులను తయారు చేసుకుని, ఖర్చులు తగ్గించుకుంటున్నారు. అధిక దిగుబడితో పాటు మంచి లాభాలను గడిస్తున్నారు. రసాయన ఎరువులు పెరగడం, వాటి వల్ల లాభాలు లేకపోవడంతో ఈ విధానంపై చాలామంది రైతులు ఆసక్తి చూపుతున్నారు.

పెరిగిన సాగు విస్తీర్ణం

మండలంలో గత ఏడాది రెండు, మూడు గ్రామాల్లోనే సేంద్రియ సాగు జరిగింది. తక్కువ పెట్టుబడితో మంచి ఫలితాలు రావడంతో రైతులు దీనివైపు మొగ్గు చూపుతున్నారు. ఈ ఏడాది మండలంలోని జి.రాగంపేట, వడ్లమూరు, గోరింట, పులిమేరు, దివిలి, చంద్రమాంపల్లి, తాటిపర్తి గ్రామాల్లో 598 ఎకరాల మేర సేంద్రియ సాగు విస్తరించింది. సుమారు 1200 మంది రైతులు వరి సాగు చేపట్టారు.

ఖర్చులు తగ్గాయి



సేంద్రియ సాగు వల్ల ఖర్చులు చాలా వరకు తగ్గాయి. రూ.10 వేలు పెట్టుబడితో రసాయన ఎరువులు వినియోగించి పంట సాగు చేసే పొలాన్ని ప్రకృతి సేద్యం ద్వారా రూ.1,000తో పండించవచ్చు. పైగా ఆరోగ్యకరమైన దిగుబడులు వస్తున్నాయి. సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తులను వాడడం వల్ల ఆరోగ్యం కూడా బావుంటుంది.

– కోన రామకోటేశ్వరరావు, సేంద్రియ సాగు రైతు, గోరింట, పెద్దాపురం మండలం

మొక్క పెరుగుదలకు ఉపయోగపడుతుంది



ప్రతీ మొక్క పెరుగుదలకు 16 రకాల పోషకాలు అవసరం. రసాయన ఎరువుల కంటే సేంద్రియ ఎరువులను ఉపయోగిస్తే సూక్ష్మపోషకాలు సంవృద్ధిగా అందుతాయి. నాణ్యమైన పంట అందుతుంది. పెట్టుబడి ఖర్చు తగ్గుతుంది. అందుకే రైతులు ప్రకృతి సేద్యంపై దృష్టి సారించాలి.

– సంజయ్‌కుమార్, మండల వ్యవసాయశాఖాధికారి, పెద్దాపురం

సార్వా సాగుకు రైతులను సన్నద్ధం చేయండి

బయో కంట్రోల్ ల్యాబ్ ఏడీఏ రత్నప్రశాంతి



సదస్సులో ప్రసంగిస్తున్న ల్యాబ్ ఏడీఏ రత్నప్రశాంతి

పెద్దాపురం: సార్వా సాగుకు రైతులందరినీ సన్నద్ధం చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్క వ్యవసాయ, ఉద్యాన శాఖ సహాయకులపై ఉందని కాకినాడ బయో కంట్రోల్ ల్యాబ్ ఏడీఏ ఎం.రత్నప్రశాంతి, డీఆర్‌సీ బీవీఎస్‌సీ వాహ రి అన్నారు. స్థానిక రైతు శిక్షణ కేంద్రంలో మంగళవారం "సార్వా సాగుకు సమాయాత్తం" అంశంపై మండలంలోని వ్యవసాయ శాఖ సహాయకులు, ఉద్యాన శాఖ సహాయకులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దాపురం ఏడీఏ దైవకుమార్ అధ్యక్షతన జరిగిన శిక్షణ సదస్సులో రత్నప్రశాంతి, హరి మాట్లాడుతూ రైతులందరూ ఈ నెలాఖరులోగా వరిపంట వెదజల్లే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువుల మందులు, కలుపు మందులను ఆర్‌బీకేల వద్ద అందుబాటులో ఉంచాలన్నారు. బోర్ల కింద పంటలు పండించే రైతు లు పంటమార్పిడి చేసుకునే విధంగా వీఏఏ, వీహెచ్ఏలు కృషి చేయాలన్నారు. ఏడీఏ దైవకుమార్ మాట్లాడుతూ సమీకృత వ్యవసాయ క్షేత్రం ప్రతీ మండలంలోను ఏర్పాటు చేసి రైతులకు సార్వా సాగుపై అవగాహన కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం పలు అంశాలపై వారికి అవగాహన కల్పించారు. పెద్దాపురం, కిర్లంపూడి ఏఓలు సంజయ్‌కుమార్, అమృత, హాట్ ఏఓ ఎస్.సుధ, ఏఈఓ ప్రసాద్ పాల్గొన్నారు.

పట్టణంలో కలెక్టర్ విస్తృత పర్యటన



సామర్లకోట సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్

సామర్లకోట: కాకినాడ జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా మంగళవారం పట్టణంలో విస్తృత పర్యటన నిర్వహించారు. మున్సిపాలిటీ పరిధిలోని ఆరవ వార్డులో శారదాదేవి ఎలిమెంటరీ పాఠశాలలో జరుగుతున్న నాడు–నేడు పనులను పరిశీలించారు. పాఠశాలకు మంజూరు అయిన నిధులు, ఆ నిధులతో చేస్తున్న పనులపై ఆరా తీశారు. పాఠశాలలు తెరిచే సమయానికి అభివృద్ధి పనులు పూర్తి చేయాలని ఆదేశాలు ఇచ్చినా ఎందుకు పూర్తి చేయలేదని పాఠశాల హెచ్ఎంను ప్రశ్నించారు. పాఠశాలకు వచ్చిన జగనన్న విద్యాకానుక కిట్లు, గోరు ముద్ద అమలు వంటి వాటిపై సమాచారం సేకరించారు. అసంపూర్తిగా ఉన్న పనులు 15 రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. అనంతరం స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. ఆస్పత్రిలో రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. ఆస్పత్రిలోని స్త్రీ, పురుషుల వార్డులు, మాతాశిశు వార్డులను పరిశీలించారు. కలెక్టర్ కృతికా శుక్లా స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఆస్పత్రిలో రోగులకు అందుతున్న సేవలను తెలుసుకున్నామన్నారు. రోగులు సంతృప్తి వ్యక్తం చేశారని, 24 గంటలూ సిబ్బంది, డాక్టర్లు అందుబాటులో ఉంటున్నారని రోగులు చెప్పారన్నారు. శారదాదేవి ఎలిమెంటరీ పాఠశాలలో అసంపూర్తిగా ఉన్న పనులను 15 రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశాలు ఇచ్చామన్నారు. డీఈఓ కె.అన్నపూర్ణ, డిప్యూటీ డీఈఓ డానియల్ రాజు, ఎంఈఓ వై.శివరామకృష్ణయ్య, మున్సిపల్ కమిషనర్ జె.రామారావు, డీసీహెచ్ఓ డాక్టరు పీబీ విష్ణువర్ధని, తహసీల్దార్ ఎస్ఎల్‌వీ కుమారి, ఉపాధ్యాయులు, డాక్టర్లు పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు అభినందనీయం

- ప్రజలకు, ప్రభుత్వానికి వారధులుగా వలంటీర్లు
- సత్కార కార్యక్రమంలో దవులూరి దొరబాబు



వలంటీర్లను సత్కరించిన దొరబాబు, ఎంపీపీ తదితరులు

సామర్లకోట: వలంటీర్లు చేస్తున్న సేవలు అభినందనీయమని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్నాలు ప్రజలకు నేరుగా అందజేయాలనే లక్ష్యంతో వలంటీరు వ్యవస్థను ఏర్పాటు చేశారని తెలిపారు. మంగళవారం జి.మేడపాడులో ఏర్పాటు చేసిన వలంటీర్ల సత్కార కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ వ్యవస్థపై ప్రారంభంలో అనేక విమర్శలు వినిపించాయన్నారు. కోవిడ్ సమయంలో వలంటీర్లు చేసిన సేవలను ప్రతీ ఒక్కరూ సెహభాష్ అన్నారని తెలిపారు. ప్రజలకు కావలసిన అవసరాలను గుర్తించి వాటిని అధికారుల ద్వారా ప్రభుత్వానికి తెలియజేస్తే ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధులుగా పని చేస్తున్నారని తెలిపారు. వలంటీర్లు చేస్తున్న సేవలపై ప్రతీ ఒక్కరూ అభినందనలు తెలియజేయడంతో వలంటీర్లను ప్రతీ ఏడాది సత్కరించాలని ముఖ్యమంత్రి నిర్ణయించారన్నారు. ఈ మేరకు ఉత్తమ సేవలు చేసిన వారికి సేవా వజ్రలో రూ. 30వేలు, సేవా రత్నగా రూ.20వేలు, సేవా మిత్రగా రూ.10వేలు అందజేసి సత్కరిస్తామని చెప్పారు. వలంటీరు వ్యవస్థ ద్వారా లక్ష లాది కుటుంబాలకు మేలు జరిగిందని చెప్పారు. వలంటీరు వ్యవస్థకు అనుబంధంగా సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రజలకు గ్రామాలలోనే మండల స్థాయిలో అందే అన్ని సేవలు అందిస్తామని చెప్పారు. సచివాలయ కార్యదర్శులకు ఇచ్చినమాట ప్రకారం వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా చేసిన ఘనత జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని పేర్కొన్నారు. సచివాలయ వ్యవస్థ, వలంటీరు వ్యవస్థ ద్వారా రాష్ట్రంలో లక్షలాది మంది నిరుద్యోగ యువతకు ముఖ్యమంత్రి ఉపాధి కల్పించారన్నారు. అటువంటి జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రిగా ఎన్నుకోవలసిన బాధ్యత మన్నందరిపై ఉన్నదని చెప్పారు. ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, గ్రామ సర్పంచ్ పటాని దేవి, ఎంపీటీసీ సభ్యులు అమలకంటి వెంకటలక్ష్మి, ముమ్మన వీరబాబు, యర్రా బేబి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మోరంపూడి రమేష్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికీ సంక్షేమం

- ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దొరబాబు
- కొండపల్లిలో 'గడపగడపకూ మన ప్రభుత్వం'



ప్రజల సమస్యలు వింటున్న దొరబాబు

పెద్దాపురం : రాష్ట్రంలో ప్రతీ కుటుంబానికి లబ్ధి చేకూరేలా రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దొరబాబు అన్నారు. 'గడపగడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పెద్దాపురం మండలంలోని కొండపల్లి గ్రామంలో గ్రామ సర్పంచ్ కొత్త చక్రరావు, ఎంపీటీసీ సభ్యురాలు పోకనాటి నాగలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి వరసాల శ్రీనివాసరావుల ఆధ్వర్యంలో ఎంపీపీ పెంకే సత్యవతితో కలిసి సుమారు మూడున్నర గంటల పాటు గ్రామంలోని గడపగడపనూ సందర్శించారు. సచివాలయ పరిధిలో ప్రజలకు అందుతున్న ప్రజా సంక్షేమ పథకాల అమలుపై గడపగడపకూ వెళ్లి అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై అక్కడి ప్రజలు సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం హౌసింగ్ చైర్మన్ దొరబాబు మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల అభివృద్ధితో పాటు ప్రతీ ఇంటికి రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందజేయడానికే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. మహిళలు, రైతుల సంక్షేమం కోసం పలు పథకాలను అమలు చేస్తున్నారన్నారు. పార్టీ వివక్ష పాటించకుండా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంపీటీసీ రాయి వెంకటేశ్వరరావు, ఎస్ఎంసీ చైర్మన్ పోకనాటి శేషారావు, నాగబోయిన రాజుబాబు, కనపర్తి చీమదొర, కేశారపు అయ్యన్న, గ్రామ వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన చేపట్టాలి

కొత్తపల్లి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన చేపట్టాలని తహసీల్దారు ప్రసాద్ అన్నారు. పొన్నాడ శివారు కోనపాపపేటలో ఉన్న ప్రభుత్వ లేఅవుట్లలో చేపట్టిన ఇళ్ల నిర్మాణ పనులను ఎంపీడీఓ అబ్రహాం లింకన్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ లబ్ధిదారులు ప్రతి ఒక్కరూ ఇళ్ల నిర్మాణ పనులను చేపట్టాలని సూచించారు. ఇప్పటికే లబ్ధిదారులతో గ్రామ వలంటీర్లు, సచివాలయ సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించామన్నారు. ఇళ్లు నిర్మించుకునే లబ్ధిదారులకు మహిళ సమాఖ్య ద్వారా అదనంగా రూ.35 వేలను అందిస్తున్నామన్నారు. ఇళ్ల నిర్మాణానికి సంబంధించి అన్ని మౌలిక వసతులు కల్పించడంతో విద్యుత్, తాగునీరు, రోడ్లు, డ్రైన్లు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆయన వెంట సచివాలయ సిబ్బంది ఉన్నారు.

ఈ ఆటోలు ప్రారంభం రేపు

సామర్లకోట: మున్సిపాలిటీలో తడి చెత్త, పొడి చెత్త సేకరించడానికి రాష్ట్ర ప్రభుత్వం సామర్లకోటకు కేటాయించిన ఈ ఆటోలను గురువారం మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ అధ్యక్షతన ప్రారంభిస్తామని మున్సిపల్ కమిషనర్ జె.రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు ముఖ్య అతిథిగా పాల్గొంటారన్నారు.

విత్తన శుద్ధిపై అవగాహన



విత్తనశుద్ధిపై అవగాహన కల్పిస్తున్న నాగేశ్వరరావు

పెద్దాపురం: విత్తన శుద్ధిపై ప్రతీ రైతుకు అవగాహన అవసరమని రిలయన్స్ ఫౌండేషన్ మేనేజర్ బర్రే నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని కట్టమూరు, కాండ్రకోట గ్రామాల్లో వ్యవసాయ శాఖ, రిలయన్స్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆయా గ్రామాల వీఏఏల అధ్యక్షతన మంగళవారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ ఈ ఏడాది 150 మంది రైతులను డిజిటల్ ఫామ్ స్కూల్‌ను ఏర్పాటు చేసి పలు వ్యవసాయ పద్ధతులపై సలహాలు, సూచనలు ఇస్తామన్నారు. కేజీ విత్తనానికి ఎనిమిది గ్రాముల సుడోమోనస్ కలిపి 24 గంటల తరువాత పొలంలో వెదజల్లుకోవచ్చన్నారు. రైతులు విత్తనశుద్ధి చేయడం ద్వారా వరి పంటలో తొలిదశలో ఆశించే తెగుళ్లను అరికట్టవచ్చన్నారు. రైతులు తమ పంట పొలాలు, పశువులు, వాతావరణం గురించి సమాచారం తెలుసుకోవాలంటే రిలయన్స్ ఫౌండేషన్ టోల్ ఫ్రీ నంబర్ 180041 98800కి ఉదయం 9.30 నుంచి సాయంత్రం 7.30 గంటలలోపు తెలుసుకోవచ్చని నాగేశ్వరరావు సూచించారు. వీఏఏలు స్రవంతి, అమృత, విజయదుర్గ, రైతులు నల్లల గోవిందు, మూర్తి, చక్రధరరావు, సుబ్రహ్మణ్యం, రమేష్‌బాబు, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా ఆయుష్ హోమం

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన పెద్దాపురం మరిడమ్మ ఆలయంలో మంగళవారం ఆయుష్ హోమం, పంచామృతాభిషేకాలు ఘనంగా నిర్వహించారు. ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ, ఈఓ సీహెచ్‌వీ రామ్మోహనరావు ఆధ్వర్యంలో వేద పండితులు అమ్మవారికి ప్రత్యేక అలంకరణతో పాటు చండీహోమం, ఆయుష్ హోమం, అభిషేకాలను నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్, ఎమ్మెల్యే చిన రాజప్ప అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నేడు జోతిష్య సదస్సు

కాకినాడ కల్చరల్: స్థానిక విద్యుత్‌నగర్‌లోని చల్లా కల్యాణ మంటపంలో బుధవారం పరాశర అకాడమీ ఆఫ్ ఆస్ట్రలాజికల్ సైన్సెస్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ స్థాయి జోతిష్య సదస్సు నిర్వహించనున్నట్టు ఆర్గనైజింగ్ కమిటీ కన్వీనర్ సరిపెల్ల శ్రీరామచంద్రమూర్తి తెలిపారు. జోతిష్య శాస్త్రంపై ప్రత్యేక పరిశోధనల ప్రసంగాలు సదస్సులో ఉంటాయన్నారు. ప్రముఖ జోతిష్య పండితులను సత్కరిస్తారని తెలిపారు.

అంతర్జాతీయ యోగా పోటీలకు 'కోట' విద్యార్థి

సామర్లకోట: అంతర్జాతీయ యోగా పోటీలకు సామర్లకోట బచ్చుఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థి ఎంపిక అయ్యాడు. ఈ మేరకు ఆ పాఠశాల హెచ్ఎం, పీఈటీలు మంగళవారం విలేకర్లకు తెలిపారు. స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో 8వ తరగతి పూర్తి చేసుకున్న కిల్లాడి యశ్వంత్ తండ్రి వద్ద యోగా శిక్షణ పొందాడు. ఈ మేరకు ఇటీవల ఒడిశాలోని కటక్‌లో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని మొదటి స్థానాన్ని సాధించినట్టు హెచ్ఎం తోటకూర సాయిరామకృష్ణ, పీఈటీ తాళ్లూరి వైకుంఠం తెలిపారు. ఈ మేరకు సెప్టెంబర్ నెలలో థాయిలాండ్ జరిగే అంతర్జాతీయ యోగా పోటీలకు యశ్వంత్ ఎంపిక అయినట్టు వారు తెలిపారు. ఈ మేరకు ఆ విద్యార్థిని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు, మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ, కమిషనర్, జె.రామారావు అభినందించారు.

ఆకట్టుకొన్న చీకటి పువ్వు



నాటికలో ఒక సన్నివేశం

కాకినాడ కల్చరల్: స్థానిక ది యంగ్మెన్స్ హ్యాపీక్లబ్ దంటు కళాక్షేత్రంలో కాకినాడ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండు రోజులు జరుగుతున్న జాతీయ స్థాయి నాటిక పోటీలు ఆకట్టుకుంటున్నాయి. భాగంగా మంగళవారం సాయంత్రం జ్యోతి వెలిగించి నాటికల ప్రదర్శన ప్రారంభించారు. ముందుగా చైతన్య కళాభారతి (కరీంనగర్) సమర్పణలో రమేష్ మంచాల దర్శకత్వంలో 'చీకటి పువ్వు' నాటిక ప్రదర్శించి ప్రేక్షకులను ఆకట్టుకొన్నారు. క్షమించడంలోనే నిజమైన ప్రేమ ఉందని నాటికలో చాటి చెప్పే ప్రయత్నం చేసి ప్రేక్షకులను మెప్పించారు. అనంతరం మిత్రా క్రియేషన్స్ (హైదరాబాద్) సమర్పణలో దేవాబత్తుల జార్జి దర్శకతంలో ప్రదర్శించిన 'అందిన ఆకాశం' నాటిక ప్రేక్షకులను ఆలోచింప చేసింది. కని పెంచిన కూతురుకు మంచి సంబంధం చూసి వివాహం చేసి మంచి జీవితం ఇవ్వాలని తల్లిదండ్రులు కలలు కంటారు. అయితే కూతురు వివాహం కాకుండానే గర్భవతి అని తెలిస్తే ఎంత కుమిలి పోతారు అన్నది నాటికలో కళ్లకు కట్టినట్టు ప్రదర్శించారు. అసోసియేషన్ కన్వీనర్స్ ఎస్.ప్రభుదాస్, కృష్ణారావు, జానకీరామ్‌చౌదరి పాల్గొన్నారు.

నేటి ప్రదర్శనలు

బుధవారం సాయంత్రం 6 గంటలకు ఎస్.రవీంద్రరెడ్డి దర్శకత్వంలో అభినయ ఆర్ట్స్ (గుంటూరు)వారి 'అతీతం' నాటిక, అనంతరం బీఎంఎస్ పట్నాయక్ దర్శకత్వంలో శర్వాణి గ్రామీణ గిరిజన సాంస్కృతిక సేవా సంఘం (గోరువంక) వారి 'కొత్త పరిమళం' నాటికలు ప్రదర్శిస్తారు.

కెనాల్ రోడ్డులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం



పోలీసులు స్వాధీనం చేసుకున్న గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

సామర్లకోట: కాకినాడ కెనాల్ రోడ్డులో వీకే రాయపురం నుంచి మాధవపట్నం వెళ్లే రోడ్డులో సర్పవరం రైల్వే జంక్షన్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని మంగళవారం పోలీసులు గుర్తించారు. 40–45 సంవత్సరాల మధ్య వయసు కలిగి ముఖం నల్లగా కమిలిపోయి ఉందన్నారు. మృతుడు నీలం గళ్లు కలిగిన షర్టు, బిస్కెట్ కలర్ ఫ్యాంటు ధరించి ఉన్నట్లు చెప్పారు. కుడి చేతికి రింగ్ ధరించే వేలు లేదని, మధ్య వేలికి వెండి ఉంగరం ఉందన్నారు. పోలియో కారణంగా పడిపోయి, చనిపోయి ఉండవచ్చునని పోలీసులు భావిస్తున్నారు. కేసు నమోదు చేసి సీఐ కె.దుర్గాప్రసాద్ దర్యాప్తు చేస్తున్నారు. వివరాలకు 94407 96568, 97016 26505 ఫోన్ నంబర్లలో సంప్రదించాలన్నారు.

మైనర్లు వాహనాలు నడిపితే సీజ్ చేస్తాం

కొత్తపల్లి: మైనర్లకు వాహనాలు ఇస్తే వాటిని సీజ్ చేస్తామని సీఐ వైఆర్‌కే శ్రీనివాసరావు అన్నారు. ఉప్పాడ–కాకినాడ బీచ్ రోడ్డులో మంగళవారం ఆయన పర్యటించారు. వాహనాలను తనిఖీ చేశారు. వాహనాలను నడుపుతున్న మైనర్లకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మైనర్లకు వాహనాలు ఇవ్వడం వల్ల ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. వారు వాహనాలు నడిపితే సీజ్ చేస్తామని తెలిపారు. ముఖ్యంగా తీర ప్రాంతంలో పర్యాటకులు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని, హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేసిన ప్రాంతాల్లోనే సముద్ర స్నానాలు చేయాలని సూచించారు. ట్రాఫిక్‌కు ఇబ్బంది తలెత్తకుండా పోలీసులకు సహకరించాలన్నారు. ఆయన వెంట ఎస్సై రామలింగేశ్వరరావు, సిబ్బంది ఉన్నారు.